ప్రజాశక్తి

మంగళవారం 22 నవంబర్ 2022

5

అల్లూరి సీతారామరాజు

బొర్రాలో నిలిచిన జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్

బొర్రా స్టేషన్‌లో నిలిచిన రైలు

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు రైల్వే స్టేషన్‌లో జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక కారణాలతో ఆదివారం అర్ధరాత్రి నిలిచిపోయింది. కొత్తవలస-కేకే లైన్లో చిముడుపల్లి బొర్రా గుహలు మధ్యలో విద్యుత్ ఓవర్‌హెడ్ తీగలు తెగిపోవడంతో, జగదల్‌పూర్ నుండి విశాఖ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 12 గంటల సమయంలో బొర్రా గుహల్లో నిలిపివేశారు. అయితే రాత్రి 12గంటల నుంచి ఉదయం సుమారు 7 గంటల వరకు ఈ ఎక్స్‌ప్రెస్ రైలు బొర్రాగుహలు రైల్వే స్టేషన్‌లో నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాత్రివేళ కావడంతో ఎటు వెళ్లలేక రైల్లోనే ఉండిపోయారు. రైల్వేశాఖ అధికారులు ఓహెచ్ కేబుల్ సిబ్బంది వచ్చి విద్యుత్‌లైన్‌ను పునరుద్ధరించారు. అనంతరం రైలు రాకపోకలు యథావిధిగా సాగాయి.

బదిలీ అయినా అందని ఉత్తర్వులు!

అయోమయంలో పిహెచ్‌సిల హెల్త్ అసిస్టెంట్లు
విధుల నిర్వహణలో గందరగోళంతో అవస్థలు

డుంబ్రిగుడ పిహెచ్‌సి

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: ఏజెన్సీలోని 11 మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు చేపడుతున్న హెల్త్ అసిస్టెంట్లకు వర్క్ అడ్జస్ట్మెంట్ కోసం ఈనెల 5న విశాఖపట్నంలో డిఎంఅండ్‌హెచ్ఒ, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. అయితే రెండు వారాలు గడుస్తున్న హెల్త్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. పాతస్థానంలో పనిచేయాలా? లేకుంటే బదిలీ అయిన కొత్తస్థానంలో విధులు నిర్వర్తించాలన్న అయోమయంలో పడ్డారు. దీనికి ముందు కూడా రెండుసార్లు బదిలీలు నిర్వహించి, ఉత్తర్వులు ఇవ్వకుండా వాయిదా వేసిన అధికారులు, మళ్లీ ఈనెల 5న మూడోసారి బదిలీలు నిర్వహించారు. ఇప్పుడు కూడా రెండు వారాలు గడుస్తున్న ఆర్డర్లు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారోననే అంతుపట్టడం లేదని హెల్త్ అసిస్టెంట్లు మనోవేదనకు గురవుతున్నారు. ఎక్కడ పనిచేయాలో తెలియని గందరగోళ పరిస్థితుల ప్రభావం గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో ఉంటుందని పలువురు అంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు కావాలనే బదిలీ ఆర్డర్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని హెల్త్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు. దీనిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లతోపాటు పలువురు గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు అంటున్నారు.

కాఫీ ప్రోత్సాహకాల కోసం
నాలుగేళ్లుగా నిరీక్షణ

బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యంపై రైతుల గగ్గోలు
అధికారుల నిర్వాకంపై రైతుసంఘం నేతల మండిపాటు
నేడు ఐటిడిఎ వద్ద పెద్దఎత్తున ధర్నా

కాఫీ రైతులకు ధర్నా కరపత్రాలు ఇస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులు కాపీ బకాయిలు, ఐటిడిఎ, కాఫీ బోర్డ్ ప్రోత్సాహక సొమ్ము కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఏజెన్సీలో దాదాపు 12వేల ఎకరాల్లో కాఫీ తోటల సాగుకు ఐటిడిఎ గిరిజన రైతులను ప్రోత్సహిస్తోంది. ఐదేళ్లు కాఫీ సాగుకు అవసరమైన సమస్త ఐటిడిఎ, కాఫీ బోర్ట్ ఆర్థిక సహకారం అందిస్తోంది. అయితే 2018 నుంచి గిరిజన రైతులకు ప్రోత్సాహక సొమ్ము చెల్లించడం లేదని కాఫీ రైతులు వాపోతున్నారు. ఇన్నాళ్ల ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందని ఆశగా ఎదురుచూసిన గిరిజన రైతులు, ఎప్పటిలో ప్రభుత్వం ఐటిడిఎ నుంచి ఎటువంటి సానుకూల స్పందన లేకపోవడంతో ఈనెల 22న మంగళవారం ఐటిడిఎ వద్ద ధర్నాకు సిద్ధమౌతున్నారు.

పాడేరు ఏజెన్సీలో 2018 నుంచి మొదలుకొని గడచిన నాలుగు ఏళ్లలో సుమారు 43 వేల మంది గిరిజన రైతులు 47 వేల ఎకరాల్లో కాఫీ సాగు చేపట్టారు. కాఫీ తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్థికప్రోత్సాహకం కింద దాదాపు రూ60కోట్లు చెల్లించాల్సి ఉందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులకు కాఫీ బోర్డు అందించాల్సిన ఆర్థిక సాయం రూ.30 కోట్లు ఇప్పటికే ఐటిడిఎకు అందించిందని, అయితే ఐటిడిఎ నుంచి కాఫీ రైతులకు ఈ ప్రోత్సాహక సొమ్ము ఇవ్వడం లేదని గిరిజన కాఫీ రైతు సంఘం నాయకులు, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, చింతపల్లి మండల కార్యదర్శి సాగిన చిరంజీవిపాటు కాఫీ రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. ఒక పక్క కాఫీ గింజలకు గిట్టుబాటు ధర లభించక, దళారుల దోపిడీకి గురై నష్టపోతున్నారని గిరిజన కాఫీ రైతులు గగ్గోలు పెడుతుంటే, మరోవైపు కాఫీ ప్రోత్సాహక నిధులను చెల్లించకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని అంటున్నారు.

కాగా కాఫీ బోర్డు ఇచ్చిన సొమ్ముతో రైతులకు ఇన్‌పుట్స్, బేబీపల్పర్లు, నిచ్చెనలు వంటివి ఇస్తున్నామని ఐటిడిఎ అధికారులు అంటుండగా, దీనిని కాఫీ రైతు సంఘం నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రోత్సాహక సొమ్ము చెల్లించాలని రైతులు కోరుతుంటే, ఈ అడ్డగోలు చర్యలేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేని స్థితిలో ఐటిడిఎ అధికారులు ఉన్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్ రేటు ప్రకారం పార్చ్‌మెంట్ రకం కిలో రూ.36 చొప్పున ఐటిడిఎ పళ్ళు కొనుగోలు చేపట్టిందని, ఈ ధర తోటల్లో పళ్ల ఏరివేత కూలీ కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ విజ్ఞప్తి మేరకు కిలో కాఫీ పళ్ల రూ.60 కొనుగోలుకు జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారని దీనికి సంబంధించి ఆదేశాలు కూడా ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ స్పందించి, రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహక నిధులు అందజేయాలని కాఫీ రైతు సంఘం నాయకులు కోరారు.

ప్రజల సమస్యలు వింటున్న జెసి శివ శ్రీనివాస్, చిత్రంలో ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కారం

అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి -రంపచోడవరం

స్పందన కార్యక్రమానికి గ్రామాల సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో జెసి శివ శ్రీనివాస్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఓ సిహెచ్.శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 70 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీలకు సంబంధించి వెంటనే పరిష్కరించగలిగే వాటిని వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, కల్వర్టులు ఏర్పాటు, వైద్యులను నియామకం, ఉద్యోగాలు అవకాశాలు కల్పన, భూ సమస్యలు పరిష్కారం, సెల్ టవర్లు ఏర్పాటు వంటి దరఖాస్తులతో పాటు వికలాంగుల సర్టిఫికెట్లు, మరికొన్ని వ్యక్తిగత సమస్యలపైనా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, నాగేశ్వరరావు, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్‌వి.రమణ, ఎస్ఓ కబోది, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహాలకు ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయండి

కేంద్ర ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన 582 గృహాలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి లక్ష రూపాయలు చొప్పున విడుదల చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్, లింటల్ లెవెల్‌లో ఉన్న గృహాలకు మూడేళ్లగా పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పశువర్ధక శాఖ ద్వారా నిర్మించిన గోకులాల బిల్లులు ఇవ్వకపోవడంతో పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఐటిడిఎ పిఒ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్ వంతల అచ్చియమ్మ, రామన్న దొర, పెంటమ్మ, చల్లన్న ఉన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - అరకు రూరల్ : రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన నాసిరకమైన వరి విత్తనాలతో ఇపుడు పైరు వెన్ను వేయక గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో మండలంలోని చొంపి గ్రామ సచివాలయం వద్ద నిరసన చేపట్టారు.అనంతరం సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు భరోసా కేంద్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని ప్రచారం చేసి, ప్రవేట్ వ్యక్తులతో చేతులు కలిపి నాసిరకమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. ఇపుడు పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు, సొమర భాస్కరరావు,గొంపి వార్డు సభ్యులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనుల లాడ్జిల జోలికొస్తే సహించం

అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : గిరిజనుడు నిర్మించిన విజయ్ విలాస్ లాడ్జి కూల్చితే పోరాటం తప్పదని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర హెచ్చరించారు. .అరకువేలి మండలం పెదలబుడు పంచాయితీ కంఠబౌన్సుగుడ గ్రామానికి చెందిన జంపరంగి అశ్వద్ధామ అనే గిరిజనుడు నిర్మించిన విజయ్ విలాస్ లాడ్జీను కూల్చివేతకు అధికారులు నోటీసు జారీ చేయడాన్ని అఖిలపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. సోమవారం అరకువేలి గిరిజన భవనంలో గిరిజన సంఘం ఆధ్వర్యాన, వివిధ గిరిజన ప్రజా సంఘాలు, ఉద్యోగుల సంఘం నాయకులు అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మట్లాడుతూ ఒక్క గిరిజనుడు నిర్మించిన లాడ్జి కూల్చివేత నోటీసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అరకువేలి మండలంలోని 1/70 చట్టం విరుద్ధంగా గిరిజనేతరుల బహుళ అంతస్తులు భవనాలు, లాడ్జీలు, రిసార్ట్స్ నిర్మించి అడ్డగోలుగా వ్యాపారం సాగిస్తున్నా పట్టించుకోని పంచాయితీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇపుడు గిరిజనుడు నిర్మించిన లాడ్జిను ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పాంగి నందో, డిటియఫ్ జిల్లా అధ్యక్షుడు వికాస్, గ్రీన్ అండ్ హెల్త్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, నర్సింగరావు ఆదివాసి సేన సంఘం నాయకులు, దురియ సాయిబాబా, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి, వి మహేష్, ఆదివాసి సంక్షేమ సంఘం నాయకులు షర్టు మోహన్, మండి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి బాలదేవ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న, ఇతర ప్రజా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లాస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు

క్విజ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ రమేష్

ప్రజాశక్తి -పాడేరు: ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు ఈ నెల 26న జరుగనున్నాయని కౌశల్ 2022 జిల్లా కోఆర్డినేటర్ పి.రమణ మూర్తి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం పాడేరులో కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల పోస్టర్లను అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 122 పాఠశాలనుండి రెండు వేల మంది విద్యార్థుల ఈ నెల 10, 11వ తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యారు. వారిలో అత్యధిక మార్కులు వచ్చిన 36 బృందాలు జిల్లా స్థాయిలో పోటీ పడనున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి రెండు స్థానాలలో నిలిచిన టీమ్‌లను వచ్చేనెల 9,10 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలకు గవర్నర్ బహుమతులు అందజేస్తారన్నారు.

మత్స్యకారుల వినూత్న నిరసన

నీటిలో దిగి నిరసన తెలియజేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- అనంతగిరి : తాటిపూడి జలాశయాన్ని నమ్ముకొని జీవనోపాధి కొనసాగిస్తున్న గిరిజన మత్స్యకారులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు. సోమవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని తాటిపూడి జలాశయంలో నీటిలో దిగి వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. జలాశయ నిర్మాణ సమయంలో మండలంలోని చిలకగెడ్డ పంచాయతీ ఒరకఒడ్డు, దెబ్బలపాడు, జీలుగులపాడు, మెట్టపాలెం గ్రామాలకు చెందిన 130 కుటుంబాలు భూములు కోల్పోయి నిరాశ్రయులుగా మారారని, నాటి నుంచి తాటిముక్కలతో తయారుచేసిన నాటుబోట్లలో చేపల వేటతో జీవనం సాగిస్తున్నామని అంటున్నారు. తాము పట్టిన రొయ్యలు, చేపలకు సరైన ధర లభించక జీవనం దుర్భరంగా సాగుతోందని మత్స్యకారుల సంఘం ప్రతినిధులు శోభ పెంటయ్య, శోభ జమ్మయ్య, శంకర్ తదితరులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.తమను మత్స్యకారులుగా గుర్తించినప్పటికీ, ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందడం లేదని వాపోతున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దంపతులు

ప్రజాశక్తి డుంబ్రిగూడ : గసభ పంచాయతీ సిమిలిగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ పాంగి గాసినాయుడు జ్ఞాపకార్థం సోమవారం స్థానిక సిపిఎం సర్పంచ్ పి సునీత, సురేష్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో 30 మంది వద్ధులు, గిరిజనులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో నిరుపేదలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రగ్గులు పంపిణీ చేస్తున్నట్లు సర్పంచ్ దంపతులు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పి సత్యనారాయణ ,జి మోహన్ దాస్ ,గ్రామస్తులు వి తమ్మయ్య, జీ రత్తు ,వి బంగురు,సర్పంచ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు
ఇష్టానుసారంగా తవ్వకాలు

- శిథిలమవుతున్న రోడ్లు,
- తెగి ముక్కలవుతున్న బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లు

తెగి ముక్కలైన బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైరు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు కాంట్రాక్టరు ఇష్టానుసారంగా ప్రొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తున్నారు. దీంతో గ్రామంలోని రోడ్లు శిథిలమవుతున్నాయి. బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లు తెగి ముక్కలవుతున్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ.31 లక్షలతో చింతూరులో ఇంటింటికి తాగునీటి కుళాయిల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పైపులైన్ల ఏర్పాటుకు సదరు కాంట్రాక్టరు గ్రామంలోని సిసి రోడ్లు, అంతర్గత తారురోడ్లను ప్రొక్లెయిన్‌తో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఈ క్రమంలో రోడ్లు పగిలిపోయి శిథిలమవుతున్నాయి. గతంలో ఉన్న పాత పైపులైను కూడా ధ్వంసం చేస్తున్నారు. పైగా కొద్ది మందికి మాత్రమే కుళాయి కనెక్షన్లు వేస్తున్నారు.

సిసి రోడ్డు తవ్వేసిన దృశ్యం

పైపులైన్ల ఏర్పాటు చేస్తున్న తవ్వకాల్లో బిఎస్ఎన్ఎల్ సంస్థ వారు భూగర్భంలో వేసిన కేబుల్స్ కట్ అవుతున్నాయి. అండర్ గ్రౌండ్‌లో పైపులైన్లు వేసేటప్పుడు అప్పటికే భూగర్భంలో ఏమైనా పైపులైన్లు, కేబుల్స్ ఉంటే ఆ సంస్థల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. తమ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదని బిఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. లక్ష రూపాయల విలువైన బిఎస్ఎన్ఎల్ కేబుల్స్ కట్ అవుతున్నా సదరు కాంట్రాక్టరు పట్టించుకోకుండా తవ్వకాలు సాగిస్తున్నారు.

సీసీ రోడ్లు, తారు రోడ్లు ధ్వంసం, బిఎస్ఎన్ఎల్ కేబుల్స్ కట్ అవుతున్న విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బుజ్జిబాబును వివరణ కోరగా పైపులైన్ వేసే క్రమంలో రోడ్లు పగిలిపోవడం సహజమేనని సమాధానం ఇచ్చారు. ఇప్పటికే రహదారి సౌకర్యాలు సరిగా లేక ప్రజలు దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉన్న కాస్తంత రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేసి ధ్వంసం చేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించి పైపులైన్ తవ్వకంలో పగిలిపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విలువైన బిఎస్ఎన్ఎల్ కేబుల్ పాడైనందున తగిన పరిహారం వసూలు చేయాల్సి ఉంది.

పంటల్లో సకశేరుకాల యాజమాన్యంపై ప్రదర్శన, శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త లలిత కామేశ్వరి

ప్రజాశక్తి - రంపచోడవరం

పంటలలో సకశేరుకాలు యాజమాన్యంపై ప్రదర్శన, శిక్షణ కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మండలంలోని పందిరిమామిడిలో సోమవారం ప్రదర్శన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారతీయ సకశేరుకాల చీడ పీడల యాజమాన్య సంస్థ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో కోతులు, అడవి పందులు, కుందేళ్ళు, ఎలుకలు, పక్షులు వంటి సకశేరుకాల యాజమాన్యంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.లలిత కామేశ్వరి మాట్లాడుతూ ఏజెన్సీలో రైతులు పండిచే అన్ని పంటలను కోతులు నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్న నేపథ్యంలో కోతుల యాజమాన్యానికి సమీష్ట కృషి చేయాలని సూచించారు. మంకీ గన్ను అగ్రి కేనన్ వాడకం ద్వారా కోతులను భయపెట్టి దూరంగా తరమడం, అడవి పంది వేషం వేసి భయ పెట్టడం, లేజర్ లైట్లు, అడ్డు తెరలు, సోలార్ కంచెలు వాడటం వంటివి చేయాలని సూచించారు. అడవి పందులు, కుందేళ్ళు, ఎలుకలు, పక్షులు పంటలకు నష్టం కలగజేసే విధానాన్ని, యాజమాన్యాన్ని సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త ఎన్.చిరంజీవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేతలు ఆర్.ప్రవీణ్ బాబు, టి.క్రాంతి కుమార్, కె.వీరంజనేయులు, కె.లక్ష్మణరావు, మండల వ్యవసాయాధికారులు జెన్నీ, పి.వెంకటేశ్వర్లు, ఎన్.రమేష్, ఉద్యానశాఖ అధికారి, గొర్లె బాలాజీ, అభ్యుదయ రైతులు బాబ్జీ, అబ్బులు, కె.శివాజీ, రైతులు పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విఆర్.పురం

డిసెంబర్ 4న విఆర్.పురంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రంపచోడవరం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ.పద్మ, మండల కార్యదర్శి ఎస్.పార్వతి పిలుపునిచ్చారు. ఐద్వా మండల కమిటీ సమావేశం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగ పద్మ, పార్వతి మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఐద్వా పని చేస్తుందని చెప్పారు. దేశంలో స్త్రీల పట్ల జరిగే సాంఘిక దురాచారాలను ఎదుర్కోవటంలో ఐద్వా ఎప్పుడూ ముందుంటుందన్నారు. వరకట్నం దురాచారాలకు బలైపోతున్న ఎందరినో మహిళను ఆదుకుందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల తరుపున ఐద్వా పోరాటం చేసిందని గుర్తు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసరాల ధరల పెరుగుదలను అరికట్టాలని, మద్యం అమ్మకాలపై పరిమితి విధించాలని పోరాడుతున్నట్లు చెప్పారు. బాలల బంగారు భవిష్యత్తు కోసం 5వ ట్యూషన్ కేంద్రాలను నిర్వహిస్తుందన్నారు. అమరవీరుల గడ్డపై జరిగే ఐద్వా జిల్లా మహాసభ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఐద్వా జెండా ఆవిష్కరణలు చేయాలని, మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో భారతి, జయమ్మ, లక్ష్మి, సుజాత, దారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ.పద్మ

ఆదివాసీలకు అమ్మ ఛారిటబుల్ ట్రస్టు సేవలు

ప్రజాశక్తి - అనంతగిరి

మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో ఆదివాసీలకు అమ్మ ఛారిటబుల్ ట్రస్టు పలు రూపాల్లో సేవలు అందిస్తోంది. ఈ పంచాయతీ పరిధిలోని బూసుపాడు, టెంకిబిడ్డ గ్రామాలకు ట్రస్టు ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి 25 మంది గిరిజన కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారు. ఎముకలు కొరికే చలితో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ రగ్గులు పంపిణీ చేసినట్లు ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు.

అంతర్జాతీయ మారథాన్ క్రీడాకారుడు గోపికి బూట్లు అందజేత

ఇటీవల జరిగిన జాతీయ మారథాన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి, పూణెలో జరగనున్న అంతర్జాతీయ మారథాన్ పోటీలకు వెళ్తున్న కొత్తూరు పంచాయితీ పరిధి తుమ్మనవలస గ్రామానికి చెందిన కొర్ర గోపికి అమ్మ ఛారిటీస్ వారు గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా బ్రాండెడ్ షూ (బూట్లు) అందజేశారు.

కెజిబివి విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ

కొత్తూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు అమ్మ ఛారిసీటీ వారు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు. ట్రస్టు ఉపాధ్యక్షులు సింగంపల్లి అర్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో కెజిబివి ఇన్‌ఛార్జి ఎస్ఒ భారతి, ఉపాధ్యాయులు దమయంతి, సూరెడ్డి బాబూరావు, దొగ్గ ఎరుకునాయుడు, లెక్కల నారాయణరావు లెక్కల కోటేశ్వరరావు, లెక్కల సత్యనారాయణ, ట్రస్టు కార్యదర్శి సింగంపల్లి అచ్చిబాబు, మహిళా పోలీసు లావణ్య, వాలంటీరు రాము, వార్డు సభ్యులు శ్రీను పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు అందజేసిన అమ్మ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

మహాసభల కరపత్రాలను ఆశ వర్కర్లకు పంపిణీ చేస్తున్న చిన్నయ్యపడాల్

బిల్లులు అందక హాస్టళ్ల నిర్వహణ భారం

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలో ఆశ్రమ వసతి గృహాల డిప్యూటీ వార్డెన్లకు ఆరు నెలల నుంచి బిల్లులు అందక హాస్టళ్ల నిర్వహణ భారంగా పరిణమించిందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్యపడాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని పలు పంచాయతీ గ్రామాలలో డిసెంబర్ 20, 21తేదీల్లో నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభల జయప్రదానికి ప్రచారం నిర్వహించారు. ఆశావర్కర్లకు మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ వార్డెన్ గా అదనపు బాధ్యతలతో పాటు హాస్టల్ నిర్వహణ కోసం అప్పుల బాధ ఉపాధ్యాయులకు తప్పడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టల్ బిల్లులు చెల్లించాలని కోరారు. 2019లో ఉన్న మెస్‌ఛార్జీలనే నేటికీ అమలు చేస్తున్నారని, ప్రస్తుత ధరలకు తగ్గట్లుగా వాటిని పెంచాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలోని 11 మండలాలలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలతోపాటు జూలై నుంచి ఇప్పటివరకు ఆరునెలల హాస్టల్ బిల్లులు చెల్లించక డిప్యూటీ వార్డెన్లు అప్పుచేసి హాస్టల్స్ నిర్వహించి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే హాస్టల్ బిల్లు బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాంగి ధనుంజయ్, ఆశ వర్కర్ల పార్వతి ధనలక్ష్మి చిన్నమ్మి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

బీట గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ, బీట గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంగడ నీలకంఠం కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి, అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాచిపెంట శాంత కుమారి ఆదేశాలతో బీట గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు, రహదారులు, కమ్యూనిటీ భవనం, డ్రైనేజీలు, ఇతర మౌలికవసతులు మచ్చుకైనా లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థికసంఘం నిధులు పంచాయతీలకు అందకపోవడంతో కనీస సౌకర్యాల కల్పనకు ఇబ్బందులున్నట్లు గుర్తించామన్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరల మండిపోతుంటే, మరోవైపు గిరిజన ఉత్పత్తులు, పంటలకు కనీసం గిట్టుబాటు ధర అందక సామాన్య గిరిజన కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రజాదర్బార్‌లో వార్డు సభ్యుడు సీసా రామకృష్ణ, రాజు, గ్రామపెద్దలు బలరాం, రామ్మూర్తి, సుందరరావు, రామచందర్, తిరుపతి, లింగమ్మ పాల్గొన్నారు.

యుటిఎఫ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు

జెఎసి కన్వీనర్ రామారావుదొర తీరుపై పలువురు మండిపాటు

డుంబ్రిగుడలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: యుటిఎఫ్‌ను విమర్శించే నైతిక హక్కు ఆదివాసీ జెఎసి కన్వీనర్‌గా 1/70 ఉద్యమాన్ని పాలకులకు తాకట్టు పెట్టిన రామారావు దొరకు లేదని యుటిఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, జిఒ3 రిజర్వేషన్ సాధన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి పాలకులు చేస్తున్న కుట్రలో జెఎసి కన్వీనర్ రామారావుదొర ఒక ఏజెంట్‌లాగా వ్యవహరిస్తున్నారని యుటిఎఫ్ అభిప్రాయపడుతోందన్నారు. ఆదివాసీ ఉపాధ్యాయులు యుటిఎఫ్ నుంచి బయటకు రావాలని జెఎసి పేరుతో రామారావు ద్వారా చేసిన ప్రకటనపై యుటిఎఫ్‌లో ఉన్న ఆదివాసీ ఉపాధ్యాయులంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజన ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, ప్రత్యేక డిఎస్‌సి సాధించి, గిరిజన ఉపాధ్యాయుల ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తున్న యుటిఎఫ్‌ను విమర్శించే నైతిక హక్కు రామారావుకు లేదన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల విద్యారంగాన్ని విజయవంతం కావడంలో పాలకవర్గంలో ఒకికిపాటు మొదలైందని, అధికారపార్టీ నేతల ఆదేశాలతో యుటిఎఫ్ పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 3 రద్దుకు కారణం యుటిఎఫ్ సంఘమే అంటూ బురద జల్లే ప్రయత్నం చేయడం ఆయనకు తగదన్నారు. గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగుల ఉద్యమాన్ని బలహీనం చేస్తున్న నిషేధమని మద్దతు ఉన్నకుంటే, పాలకులకు తొత్తులుగా ఉండే వ్యక్తులతో రామారావు దొర కలిసి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. జిఒ 3 సాధనకు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న గిరిజన సంఘానికి యుటిఎఫ్ ఆర్థికంగా సహాయం అందించిందని, రామారావుదొరకు చిత్తశుద్ధి ఉంటే ఉద్యమానికి కలిసి రావాలని కోరారు. వ్యక్తిగత రాజకీయ అవసరాలకు పెద్దపీట వేస్తున్న రామారావుదొరకు జెఎసి జిల్లా కన్వీనర్‌గా ఉండే కనీస నైతిక అర్హత కూడా లేదన్నారు.ఎలాంటి వాస్తవాలు లేకుండా యుటిఎఫ్ విమర్శిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు చిట్టిబాబు, కే రఘునాథ్, ఎం బాబురావు ,ఎల్ నారాయణ పాల్గొన్నారు.

యుటిఎఫ్‌పై దుష్ప్రచారం తగదు

ముంచింగిపుట్టు: ఆదివాసీ ఉపాధ్యాయులు యుటిఎఫ్ నుంచి బయటకు రావాలని ఆదివాసీ జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర చేసిన ప్రకటనలపై యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న 'భారత బచావో' మేధోమథన సదస్సులో పాల్గొన్న రామారావుదొర వాట్సప్ ద్వారా పంపిన పత్రికప్రకటనలో ఇలాంటి సూచనలు చేయడం సరికాదన్నారు. జిఒ 3 రద్దుకు వ్యతిరేకంగా ఆదివాసీలు చేస్తున్న న్యాయపోరాటానికి మద్దతునిస్తూ, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు రాయడంతో పాటు, రివ్యూ పిటిషన్‌కు ఇంప్లీడ్ కావాలని సూచిన ఘనత యుటిఎఫ్‌దేనని, అలాంటి యుటిఎఫ్‌పై బురదజల్లే ప్రకటనలు చేస్తే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు, పుందరి, గోపి, ధనుంజయ, ఎస్ రాజు, సిద్దేశ్వరరావు, సిద్దార్థ రేణుక, ఎ.బుదు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ధర్మారావు

ఆశ్రమాల్లో నిషేధాజ్ఞలపై ఎస్‌ఎఫ్‌ఐ మండిపాటు

గిరిజన సంక్షేమ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులకు ఖండన

నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి పాడేరు :గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో ఇతరుల ప్రవేశం నిషేధమని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులను జారీ చేయడంపై ఎస్ఎఫ్ఐ వ్యతిరేకించింది. .సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో 122 ఆశ్రమ పాఠశాలలో వర్కర్స్, హెల్త్ వర్కర్స్, వాచ్‌మెన్, ఉపాధ్యాయుల ఖాళీల నియామకం, మెస్ చార్జీల పెంపు, కాస్మోటిక్స్ సరఫరా వంటి సమస్యలెన్నో వుంటే, వాటిని పట్టించుకోకుండా ఆశ్రమాలపై నిషేధాజ్ఞలు విధిస్తారా అంటూ గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండేను సూటిగా ప్రశ్నించారు. బోధనేతర సిబ్బంది కొరతతో విద్యార్థులకు భద్రత లేదని, అల్లూరి జిల్లాలో విద్యార్థుల మరణాలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఆశ్రమాల నిర్వహణలో వైఫల్యాలు, లోపాలు డొల్లతనం బయటపడకుండా ఉండడానికే ఇటువంటి నిషేధాజ్ఞలు చేస్తున్నారని విమర్శించారు.

విద్యార్థి సంఘాలుగా తాము కచ్చితంగా పాఠశాలలు, కళాశాలలు సందర్శిస్తామని, విద్యార్థుల సమస్యలు బయటకి తీసుకొచ్చి ఉద్యమాలు, పోరాటాలు నడుపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్,వరహాలు మరియు మండల నాయకులు మచ్చ రాజు,మాణిక్యం పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

క్రమశిక్షణ తప్పితే అనర్థాలే!

ప్రజాశక్తి-అనంతగిరి : విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ తప్పనిసరి అని, క్రమశిక్షణ తప్పితే అనర్థాలేనని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. శనివారం తాడిగూడ జలాశయంలో జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో కళాశాలను సందర్శించి దీనిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలేజీకి వచ్చిన విద్యార్థులు సక్రమంగా తరగతి గదుల్లో ఉండి చదువుకోవాలని, కాలేజీ వేళల్లో ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది అనుమతులు లేకుండా బయటకు వెళ్లడం సరికాదన్నారు. కొందరు పిల్లల చేష్టల వల్ల ఇటువంటి అనర్థాలే జరుగుతాయన్నారు. దీని వల్ల కాలేజీకి చెడ్డపేరుతోపాటు తల్లిదండ్రులకు గుండెకోత తప్పదన్నారు. కాలేజీకి వచ్చిన తర్వాత అత్యవసరమైతేనే ప్రిన్సిపల్, ఇతర లెక్చరర్ల పర్మిషన్‌తో బయటకు వెళ్లాలని సూచించారు. కాలేజీ విద్యార్థులు గుంపులుగా రోడ్లపైనే కనబడుతున్నారని, ఇలాంటి చిల్లర చేష్టలు మానుకోవాలని విద్యార్థులకు సూచించారు. గతేడాది ఇంటర్ ఫలితాలు మరీ తీసికట్టుగా వచ్చాయని, ఈ ఏడాది ఇప్పటికైనా బాగా చదువుకుని మంచి రిజల్ట్ సాధించాలని సూచించారు. విద్యార్థులు మాట వినకపోతే, తమ దృష్టికి తీసుకురావాలని కాలేజీ యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమల రూతు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, వార్డు మెంబర్ సుబ్బారావు, టిడిపి మండల మహిళా నాయకురాలు బి లక్ష్మి, బుజ్జిబాబు ఎంపిడిఒ హర్షిత్, ఉప తహశీల్దార్ పాత్రుడు, కళాశాల ప్రిన్సిపాల్ సునంద, పోలీసులు పాల్గొన్నారు.

23 నుంచి కరాటే శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు :మండల కేంద్రంలోని దాసరిపుట్టు నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద ఇంటర్నేషనల్ కోవుఖన్ కరాటే శిక్షణను ఈనెల 23 నుంచి ప్రారంభించనున బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డౌన్ కరాటే మాస్టర్ కె.సురేష్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఐదుగంటల నుంచి ఆరుగంటల వరకు అలాగే సాయంత్రం కూడా ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన యువతీ యువకులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. పేర్లు నమోదు, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 6302830393కు సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత పోతురాజు

కాఫీ ప్రోత్సాహక బకాయి చెల్లించాలి

- గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: కాఫీ రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.30 కోట్ల కాఫీ ప్రోత్సాహక నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం గసభ పంచాయతీ శిమిలిగూడ గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాఫీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలోని11 మండలాల్లో లక్ష 30 వేల కుటుంబాలు కాఫీ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి నాలుగేళ్ల నుంచి అందవలసిన ప్రోత్సాహక నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. నిధుల చెల్లింపులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, ఈనెల 22న పాడేరు జిల్లా కేంద్రంలో కాఫీ రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో అధిక సంఖ్యలో కాఫీ రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, గిరిజన సంఘ మండల కార్యదర్శి పి సత్యనారాయణ, కాఫీ రైతులు పాల్గొన్నారు.

డోకులూరు బాదుడే బాదుడు కార్యక్రమంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

వైసిపి పాలనలో గిరిజనులకు ఒరిగింది సున్నా

- బాదుడే బాదుడులో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైసిపి ప్రభుత్వ మూడేళ్ళ పాలనలో గిరిజన ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమి లేదని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆరోపించారు.. సోమవారం పాడేరు మండలం డోకులూరులో టిడిపి బాదుడే బాదుడు కార్యక్రమంలో మాట్లాడుతూ, గిరిజన గ్రామాల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. నాడు చంద్రబాబు పాలనలో ఏమి జరిగిందో, నేడు వైసిపి పాలనలో ఎంతగా అన్యాయం జరిగిందో ప్రజలు గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేష్ కుమార్, రాష్ట్ర ఎస్ టి సెల్ కార్యదర్శి గబ్బాడ సింహాచలం, నియోజకవర్గ ఎస్ టి సెల్ అధ్యక్షులు బుక్క జగదీష్, వెంకటరమణ (బుజ్జి), కష్టారావు, చిట్టిబాబు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిటిసి

పంచాయతీ కార్యదర్శిపై సమగ్ర విచారణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలకేంద్రం హుకుంపేట పంచాయతీ కార్యదర్శి త్రినాథరావుపై పది రోజులుగా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి కొమ్మ రమ్య అన్నారు. సోమవారం ఎంపిడిఒ ఆర్.వెంకటరావును కలిసిన మెమోరాండం అందించారు. హుకుంపేట పంచాయతీ కార్యదర్శిపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను బయటపెట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతవానిపాలెం గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా నాలుగు కేజీల గంజాయి పట్టుబడింది. బాలరేవులు మార్గం నుండి కొయ్యూరు మీదగా రాజవొమ్మంగి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి తమ బైక్‌ను వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించారు. నిందితులు కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన డెక్కల లక్ష్మణ్, కొయ్యూరు మండలం బోదరాళ్ల పంచాయతీ పిట్లపాడుకు చెందిన మర్రి బాలయ్యను పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి, ఒక బైకును చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టుగా ఎస్సై తెలిపారు.

ఎపి పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యాన..

23 నుంచి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్

ఎగ్జిబిషన్ వివరాలు వెల్లడిస్తున్న మూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకూ విశాఖపట్నంలోని రైల్వే న్యూ కాలనీ వద్ద ఉన్న సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో 13వ ఆంధ్రప్రదేశ్ ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్-22 (అపెక్స్-22)ను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ డిఎస్‌విఆర్.మూర్తి తెలిపారు. సోమవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13వ రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉపకులపతి ప్రొఫెసర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ముగింపు కార్యక్రమంలో 25వ తేదీన వాల్తేరు డివిజన్ డిఆర్ఎం అనుప్ సత్పతి పాల్గొంటారని తెలిపారు ఎగ్జిబిషన్‌లో 109 మంది ఫిలాటలిస్టులు సుమారు 5400 స్టాంపులను ప్రదర్శిస్తారన్నారు. అంతేకాకుండా స్టాంపులపై అవగాహన పెంచేందుకు విద్యార్థులకు ప్రత్యేక క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలకుగాను కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే ప్రత్యేక బృందం విజేతలను ఎంపిక చేస్తుందన్నారు. 1800 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో భాగంగా నాలుగు ప్రత్యేక కవర్లను ఆవిష్కరించనున్నామన్నారు. 23న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌పై ఒక కవర్‌ను, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌పై మరో కవర్‌ను, 24న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యేక కవర్‌ను, 25న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రయోగశాల (ఎన్ఎస్‌టిఎల్)పై మరో కవర్‌ను విడుదల చేస్తామన్నారు. అపెక్స్‌పై అమెండైమెంట్ రియాల్టీతో ఒక కవర్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ అందరికీ కనువిందుగా ఉంటుందన్నారు. పిల్లలకు స్టాంపులపై అవగాహన పెంచుతుందన్నారు. సంస్కృతి, వారసత్వం, చరిత్ర, దేశ స్వాతంత్ర్యం కోసం దేశభక్తులు చేసిన త్యాగాలను వారు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీస్ కర్నూల్ నుంచి ఎం.జగదీష్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ నుంచి అజిత్ కుమార్ నాయక్, బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వాడకంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-చింతూరు : ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని మండలంలోని ఎర్రంపేట గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమారి అన్నారు. పాఠశాలలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల ఉపయోగాలు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ చింతూరు సూపర్వైజర్ పి.నరేష్, వాలంటీర్లు చంద్రకళ, వెంకటలక్ష్మి, దీపిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎర్రంపేట బాలుర కళాశాల వసతి గృహంలోనూ ర్యాలీ నిర్వహించార. వసతి గృహం వార్డెన్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి- అడ్డతీగల

గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కెవి.హరినాథరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరు : గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గూడూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాధన సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

జిఒ 52ను రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకి, బెంతూ ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే ఉద్దేశంతో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్యామల్ ఆనంద్ కుమార్‌తో ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన జిఒ 52ను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ పిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పిఒకు వినతిపత్రం అందజేశారు. దీనికి ముందు రంపచోడవరం బస్టాండ్ నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చెర్చాలంటే ఆర్టికల్ 342, క్లాజ్-1, క్లాజ్ -2 ప్రకారం జరిగాలన్నారు. రాయలసీమలోని బెంతూ ఒరియా (ఒడ్డి, ఒరియా) బోయ, వాల్మీకి కులాల సంస్కృతికి, ఆదివాసీల సంస్కృతికి ఎక్కడా పొంతన లేదన్నారు. ఈ కులాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఆదివాసీల కంటే అభివృద్ధి చెందిన కులాలు అని, వీటిని ఎస్‌టి జాబితాలో చేర్చడం రాజ్యంగం విరుద్ధమని, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తీగలు బాబురావు, చావలం రాంబాబు, బాలు దొర, కుర్సం వరలక్ష్మి, మడకం లక్ష్మి, గొల్లె రవికుమార్, వీరమణి, ప్రసాద్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - విఆర్.పురం : కూనవరం మండలలో కూనవరం శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కూనవరం ఎంపీపీ పాయం రంగమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథ పఠనం అలవర్చుకోవాలని సూచించారు. డాక్టర్ వెంకయ్య మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారా ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడన్నారు. ఎంపిడిఒ ఫణేంద్ర మాట్లాడుతూ తనకు బాలలు పుస్తకాలంటే ఎంతో ఇష్టమని చెప్పారు. అనంతరం వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు పలు వేషధారణతో అలరించారు. అల్లూరి సీతారామరాజు వేషధారణకు ప్రథమ బహుమతి, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణకు ద్వితీయ బహుమతి, భారతమాత వేషధారణకు తతీయ బహుమతిని న్యాయనిర్ణేతలు ప్రకటించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ అనంతలక్ష్మి, రాష్ట్ర మేరీకుల డైరెక్టర్ కొండ గంగాధర్, సిపిఐ నాయకులు సూర్య చంద్రరావు, నోబుల్ సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ఎం.గోవిందరాజులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.